జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# సొమ్మొకాడిదే-సోకొకాడిదే

అంగర వెంకటశివప్రసాదరావు

"ఏటియ్యాల యింత ఆలీసం అయిపోనాది" కాళ్ళకి నీళ్ళిస్తూ అడిగింది లచ్చి.

'అయ్యగోరు నాపేరుమీద బండి బుక్కు చేసేరే. ' ఆనందంగా అన్నాడు సింహాచెలం.

"ఏటి ఎద్దులబండా ?" అడీగింది లచ్చి గిన్నెలో అన్నంపెడ తూ.

"ఓసి ఎర్రిమొగమా . బండంటే ఎద్దుల బండిగాదే, సూటరు. దాని కరీదెంతనుకుంత న్నావు ? దగ్గిర దగ్గిర ఆరువేలు !"

"ఏటీ ఆరువేలే ! రూపాయలేనా ? ఆరొందలు కల్ల సూళ్ళేదు ఆరువేలు ఏడ నించి వొస్తాయిరా మావా! అవునూ నాకు తెలీకడుగుతానూ నువ్వుచేసే బంట్రోతు వుజ్జోగానికి సూటరెందుకు ?"

"నువ్వు నిజ్జెంగా ఎర్రిమొగానివేనే అయ్య గోరు నా పేరుమీద బండి బుక్కుచేసేరన్నాను గానీ, నాకు బండి యిచ్చేస్తారన్నానేటే అసలు సంగతేటంటే నిన్న పేపర్లో సూటర్లు బుక్కు చెయ్యడానికి యియ్యాల్టి నుంచి అప్లికేషను పారాలు యిస్తారని అచ్చే సారు. అయ్యగోరు పేపరు సూసి, నన్ను యియ్యాల సీకట్నే రమ్మన్నారు. నాను ఎల్లేను గందా ఏటీ ఎల్లేనంటావా నేదా ?"

"ఎల్లేవు "

"అప్పుడేటైందంటే అయ్యగోరు నన్ను ఆరి సూటరుమీద ఎక్కించుకుని మద్దిలి పాలెంలో వో ఆపీసుకాడికి తీసుకెళ్ళారు అక్కడ తీర్తకెజలా జనం నిలబడివున్నారు. నన్ను అయ్యగోరు ఆ లైనులో నించోబెట్టి నా సేతిలో అయిదు కాయితం పెట్టి "ఒరేయ్ సింహాచెలం—అప్లికేసన్లు తీసుకుని యింటికి ఎలిపొచ్చేయి" అంటూ చెప్పి, ఆరెల్లి పోయారు.

"ఏటి ! మద్దిలిపాలెంలో నిన్నొగ్గేసి, ఆరింటికి ఎల్లిపోనారా మరాడనుంచి నువ్వెలాగొచ్చేవురా " బెంగగా అడిగింది లచ్చి.

"ఉండహే మద్దిలో పానకంలో పుడకనాగ అడ్డురాకు ఆరు ఎల్లిపోనారు గందా ఆలైను అనుమంతుడు తోక నాగ పెరిగి పోతన్నాది. సూరీడు నెత్తెక్కి పోతన్నాడు. సెమట్లుకారి పోతన్నాయి. ఆ ఆపీసువోళ్ళునింపాదిగావొచ్చి తలుపు తీసి, అప్లికేసను పారాలు యిచ్చినారు. నాను అప్లికేసను పారాలు తీసుకుని, మద్దిలి పాలెం నుండి అయ్యగారి బంగలాకి నడిచెల్లి పోనాను.''

"అంతదూరం ఎలాగొస్తాడన్న బుద్ది ఆరికుండాల.పోనీ సిటీకి డబ్బులైనా యివ్వనేదు. పెద్దోలంతాయింతే. మన్లాటోల్లు ఆరి అడుగులకు మడుగులొత్తాల" దుయ్యబట్టింది లచ్చి.

"ఊరుకోయే ఆల్లు వుండబట్టే మనకీ పాటి గెంజి నీల్లన్నా దొరుకుతున్నాయి."

"సాల్లేరా ఈపాటి మన పల్లెటూర్లో దొరకదేటి? నువ్వెప్పుడూ ఆల్లు నేసిందే రైటంటావు'' ఎత్తి పొడిచింది లచ్చి.

"అప్పుడేటయ్యిందంటే...నాను అప్లికేషను పారాలు అట్టుకెల్లానా అయ్యగోరు ఆరిపేరు మీద వోటి పెద్దమ్మగోరి పేరుమీదవోటి, సినబాబుగోరిపేరుమీద వోటి, సిన్నమ్మగోరి



పేరుమీద వోటి అప్లికేసనుపారాలు నింపేసినారు ''

"ఎటి అమ్మగోరు సూటరు నడుపుతారేటి ?'' మధ్యలో అందుకుంది లచ్చి

"నా నందుకే నిన్ను ఎర్రిమొగవాఁ అంటూ వుంటాను. అప్లికేసను పారం నింపారన్నాను గాని అమ్మగోరు బండి తొక్కుతారన్నానా. యికపోతే మరో అప్లికేసను పారం వుండిపోనాది. అది ఎవురిపేర నింపాలా అని అయ్యగోరు ఆలోసించతుంటే, అమ్మగోరు ఆరి తమ్ముడుగోరి పేరు నింపమని అడిగినారు. అంటే అయ్యగోరి బామ్మర్దిగోరన్నమాట.

"అయ్యగోరు ఏటన్నారో తెలుసా?''

"నాకేటెరిక నువ్వు సెప్తన్నావుగా ''

"ఏటన్నారంటే ఆడిపేర్న బుక్కు సేస్తే బండాడు అమ్మేసుకుంటాడని సెప్పి, యింగిలీసులో ఏకేటో అన్నారు. అవన్నీ నీకు సెప్పినా అరదంగావులే అందుకే నీకు సెప్పలేదు '' దర్జాగా చెప్పాడు సింహాచెలం.

"నువ్వు సదివీసినావు గందా కలకటేరు సదువు పెద్ద నీకే అరదమైపోనాది." విసుక్కుంది లచ్చి.

## రచయిత గురించి

పుట్టింది, పెరిగింది, కలం పట్టింది విశాఖపట్నంలోనే. రచయితగా పూపిరిపీల్చింది సరిగ్గా పదేళ్లక్రితం యిదేపత్రికలో. ఈ పదేళ్లలో చేసిన



రచనలు సుమారు పాతిక వుంటాయి (అచ్చయినవి). అందులో ఒకటో, అరో సాధారణ బహుమతులు పొందినవి వున్నాయి.

కీర్తిశేషులు అంగర వెంకట కృష్ణారావుగారు మా అప్పగారు (పెద్దనాన్నగారు). వారే నాలోని రచయితని మేల్కొల్పి, నాచే 'అ' 'ఆ'లు దిద్దించారు. నా రచనలు చూసి పనికొస్తావన్నారు.

పురుషలక్షణమని వుద్యోగంచేస్తూ, సాగర సంసారపులోతులు చూస్తూ, మధ్య మధ్య రచనలు చేస్తున్నాను.

ఈ కథకి తప్పక బహుమతి వస్తుందని నా అంతరాత్మ (ఉంటే) చెప్పింది. అది నిజం చేశారు ఈ పత్రిక సంపాదకులు.

"ఉండెహే....నాను సెప్పేది సాంతం యిను. ఆఁ....ఎంతదాకా సెప్పేను.ఆఁ....అయ్యగోరు దిక్కులు సూస్తూ ఆలోసిస్తన్నారు. నాను ఆరి ఎదురుగ్గా సేతులు కట్టుకు నిల్సున్నాను.

ఆరు నాకేసి సూసి "సింహాచెలం నీకు బాబున్నాడా?" అని అడిగేరు.

"మా అయ్యా బాబు....ఆడుపోయి మొన్న పండక్కి రెండేళ్లు అయిపోనాదే" అంటూ కళ్ళనీళ్ళొట్టుకున్నాను.

'పేరేంట'ని అడిగేరు.

నాను 'అప్పన్న'ని సెప్పాను.

ఆ అప్లికేసనుమీద నాపేరు, మా అయ్య పేరు యింకా ఏటేటో రాసినారు. సివర్న నన్ను అందులో సంతకం సెయ్యమన్నారు."

"ఏటీ, అందులో సంతకం ఎట్టేసినావేటి...? ఎవురేనా కాయితం ముక్క సూపించి సంతకం పెట్టమంటే ఎట్టేడమేనా....? నాలుగు అచ్చరం ముక్కలు నానేగందా సదివేనని గొప్పగా సంతకం సేసీడమేఁ...."

"మనకేటి బయమే ఎర్రిమొగమా....మనకి బూములున్నాయా .... పుత్రలున్నాయా....ఏటి నాక్కుంటారని బిడువు." నవ్వుతూ అన్నాడు సింహాచెలం.

"మనకేటి బయమని నింపాదిగా అడుగుతున్నాడు....ఆల్లకి మనం బాకీ వున్నామని సెప్పి రాయించేసి, మన వొంట్లో నీవూఁ నెత్తురు పిండీగల్రు.జలమంతా ఆల్ల కొడపడుంటి ఆల్లకి సాకిరీ సెయ్యాల....అది సాల్దేటి...."

"అయ్యగోరు అలాంటోరు కాదే...." తేల్చిగా తీసిపారేసాడు సంహాచెలం.

"ఏ పుట్టనో ఏ పాముందో మనకేటెరుక."

"సర్లె నీ సోదెప్పుడూ వుండేదే....నాను

సెప్పింది యిను. ఆ తరవాత అయ్యగోరు అవేవో పేపర్లు. ఆటిపైన పెద్దపెద్ద సింహం బొమ్మలు వున్నాయి. ఆటిమీద ఏటో రాసి, మల్లీ సంతకం పెట్టించుకున్నారు.

"ఓరి! ఆటిమీదకూడ సంతకం ఎట్టేశావా., అది టాంపుపేపరని మా అయ్య సెప్పినాడో పాలి. మన పెల్లికి మా పొలం అమ్మేసినప్పుడు ఆ కాయితంమీద రాయించి అయ్యసేత ఏలి ముద్దర ఏయించినాడు ఫకీలు బాబు అవి దస్తావేజులంట ఓరి దేవుడోయ్ నా కొంప కూల్చేసినావు గందా '' అంటూ ఏడుపు మొదలుపెట్టింది.

"ఊరుకోహే ఆఁ సెప్పడం మరిసిపోతాను. రేపు సీకట్నే లేపు. పోట్టాపీసునో పనుంది. అయ్యగోరు సెప్పినారు."

"ఏ గంగనో దూకుతావో దూకు నాకేటి.." నులకమంచంలో ముసుగుతన్ని పడుకుంది లచ్చి.

సింహాచెలం చుట్ట వెలిగించి, పూరిపాక కన్నాల్లోంచి కనిపిస్తున్న చంద్రుణ్ని చూస్తూ పొగ పీలుస్తున్నాడు. చుట్ట పూర్తిగా కాలేంత వరకూ కాల్చి, రేపటిగురించి ఆలోచిస్తూ పడుకున్నాడు.

* * *

"ఇవాళెన్ని సంతకాలెట్టావు " గుమ్మంలోనే ఎదురెళ్ళి అడిగింది లచ్చి.

"రెండు.." కాళ్లు కడుక్కుంటూ చెప్పాడు సింహాచెలం.

"అవున్లే నిండా మునిగినోడికి సలేటి ఎట్టెట్టు రావ(కోటిలా ఎట్టు సంతకాలు..సీకట్నే యెలిపోడం పొద్దుగూకేక రావడం " అన్నం వడ్డిస్తూ అంది లచ్చి.

"ఇయాలేమైందంటే ''

"నాకేటి సెప్పక్కర్నేదు. బేగీ వణ్ణంతిని తొంగో మల్లీ రేపు సీకట్నే నేపుతాను. రేపెల్లి మరో పాతిక సంతకాలు ఎట్టు ''

"నీ సొదెక్కువై పోనాదే నా నియాల సెప్పిగాని తొంగోను. ఇయాల ఏమైనాదంటే."

"అదుగో మల్లీ నాకు సెప్పొద్దన్నానా." కయ్యిమంది లచ్చి.

"నీతో ఏటి సెప్పడం నేదు. నాలో నేనే సెప్పుకుంటున్నాను. అయ్యగోరు, నాను కలిసి పోట్టాపీసుకి ఎల్లాం. అక్కడకూడ జనం బారులుతీరి నిల్సోని వున్నారు. నన్ను అయ్యగోరు ఆ లైనులో నించోబెట్టి నిన్నట్లా ఎల్లిపోలేదు. ఎదురుగ్గా వున్న సోపాలో కూకున్నాడు. ఆరెండుకు కూకున్నారో తెలీక నాను పల్లకున్నాను. కొంచెం సేపటికి పోట్టాపీసు మడుసులు వొచ్చి సిలేమా టిక్కట్లు బుక్కింగులా దోరుతీసి మాకాడ కాయితాలు, డబ్బూ తీసుకుంటున్నారు.

"అయ్యగోరూ మీరెల్లిపొండి, నానీ పని సిటంలో నేసుకుని ఎలిపొస్తను" అని అన్నాను.

అయ్యగోరు నవ్వి, 'డబ్బుతో పన్రా రెండువేల అయిదొందలు కట్టాలి' అన్నాడు.

అయ్యగోరు కూచున్న సోపాకాడ పంకా నేదు. దూరంగా వుంది. గాల్లేక అయ్యగోరు ఆపసోపాలు పడిపోతన్నారు సోపాలో. మజ్జిలో అయ్యగోరు 'ఒరేయ్ నువు లైన్లోంచి ఏడకీ ఎల్లిపోక, నానిప్పుడే కాపీ తాగొస్తా ' అంటూ బైటికెల్లారు. మల్లీ వొచ్చి సోపాలో కూకున్నారు. మా లైను నీవ(లా నడుస్తోంది."

"అంతేకాని నీకు టీనీల్లుకూడ పోయించ నేదు అయినా నాకెందకులే ''

"నీక్కాడని సెప్పేనా సెప్తుంట నువ్వెందుకు యినాలి ఆఁ. సివరికి నా ముందు మడిసికాడ కాయితాలు తీసుకున్నాడు బుకింగులో ఆసామి. ఆ తరవాత నానే అప్పుడు అయ్యగోరొచ్చి, 'యిక నువ్వు యిటొచ్చి, నాను నిలబడతాన'ని సెప్పేరు. నాను హాయిగా పంకా కాడికెల్లి గుండెల్నిండా గాలి పీల్చుకున్నాను."

"మనకదే మిగులుద్ది సివరకి '' నెమ్మదిగా గునిసింది.

"అయ్యగోరు డబ్బు కట్టేసి బైటికొచ్చి 'నువు యింటికెలిపోరా నాకు ఏరే పనుందంటూ' ఎల్లిపోనారు. నాను కాల్లీడ్చుకుంటూ బంగలాకి ఎలిపోనాను.

ఇవాల కత యిది" అంటూ ముసుగుతన్ని పడుకున్నాడు సింహాచెలం.

* * *

"అయ్యగోరు నా పేర్న సూటరు బుక్కు-నేసేరని సెప్పానుగందా ఏటిః గురుతుందాః" రెట్టించి అడిగాడు సంహాచెలం.

"ఇంకా ఆ కత అవనేదేటి ః" విసుగ్గా అడిగింది లచ్చి.

"కత మొదలైంది యియ్యాలేనే యియ్యాల ఆ ఆపీసోళ్లు ఎవురు సూటరు బుకింగు సేసిన ఆపీసోళ్ళు సీట్లు తీస్తారంట. అందునో వొరసగొచ్చిన నెంబర్లకి సూటర్లు ఆ వొరసలోనే అమ్మితారంట.

మరో యిసిత్రం ఏటంటే మొట్టమొద లొచ్చిన నెంబరుకి బండి వుత్తినే యిచ్చీస్త రంట. అంటే అరదంగాలేదాః డబ్బు పుచ్చుకో రంట."

"ఎటీ మాట నమ్మమంటావా ఆరువేలు కరీదుసేసే సూటరు వుత్తి పున్నేనికి యిచ్చి డానికి ఆదేం మన మాంగోరాః నేక అత్త కొడుకా " ఎకతాళిగా అంది లచ్చి.

"మరి కాదేటి లచ్చా ఏభైవేల అప్లికే సన్లనో మొట్టమొదట లెంబరు రావడం మాటేటి ః" సంబరపడిపోతూ అన్నాడు సింహాచెలం.

"అదేదో నీకే వచ్చీసినట్టు మా సంబరపడి పోతున్నావు'' దెప్పి పొడిచింది లచ్చి.

"సర్లె బేగే వణ్ణం ఎట్టు. మల్లీ బంగ లాకి ఎల్లాల. అయ్యగోరు, నాను కలిసి ఆ ఆఫీసుకాడి కెల్లాల" అంటూ కాళ్ళు కడుక్కో-డానికి వెళ్ళాడు సింహాచెలం.

* * *

జనం కిటకిటలాడిపోతున్నారు. డ్రా తీసే టైము దగ్గరపడుతోంది. కలక్టరుగారు యింకా రాలేదు. వారి సమక్షంలో డ్రా తియ్యబడు తుంది.

అంతా ఆతృతగా ఎదురుచూస్తున్నారు. కలక్టరుగారి కారు రానే వచ్చింది. అప్లికేషను మీద వున్న నెంబర్లు వేరే చిన్నచిన్న కాయితాల మీద ప్రింట్‌చేసి, అవన్నీ పెద్ద పెట్టెలో వేసి స్టేజిమీద పెట్టేరు.

కలక్టరుగారు నించుని చిన్న వుపన్యాసం యిచ్చారు. వాహనసౌకర్యం ఎంత అవుసరమో చెప్తూ, పరిగెడుతున్న కాలంతోపాటు మనమూ పరిగెత్తాలని, నడిస్తే లాభం లేదని, సిటీ బస్సులమీద, రిక్షాలమీద వెళ్తే పనులు జర గడం కష్టమని, పెద్ద వాహనాలు అంటే కారు లాంటివి కొని, భరించే స్థోమత ఎంతోమందికి వుండడం కష్టమని, తిండి గింజలకంటే అధి కంగా పెరిగిపోతున్న పెట్రోలు ధర వలన, లీటరుకు ఎక్కు-వదూరం వచ్చే చిన్నచిన్న వాహనాలు అంటే స్కూ-టర్లు, మోపెడ్లు ఎంత అవసరమో విశదీకరించారు.

కొంతవరకూ పబ్లిక్కు- గౌరవంగానే ఆయన వుపన్యాసం విన్నారు. ఇక వినే వోపిక లేక చప్పట్లు కొట్టేసారు. తను చెప్పిన మాటల్లో ఏది జనాన్ని హర్షింపజేసిందో అర్థంకాలేదు కలక్టరుగారికి.

మొత్తానికి అనుకున్న సమయానికి ఒకటి రెండు గంటల ఆలస్యంలో డ్రా మొదలైంది.

మొట్టమొదటి నంబరుకు స్కూ-టరు ఫ్రీగా యివ్వబడుతుందని ఆ ఆఫీసు యాజమాన్యం వారు గర్వంగా తెలియపరిచారు.

ఈ మారు జనం మళ్ళీ చప్పట్లుకొట్టేరు, ఈలలు వేసారు.

నాకే నాకే అంటూ గోల తరంగం జనం మధ్య లేచి-ది.

దూరంగా నిలుచున్న సింహాచెలం యిదంతా చోద్యం చూస్తున్నట్లు చూస్తున్నాడు.

స్టేజికి దగ్గరో వున్న రిజర్వుక్లాసు కుర్చీల్లో కూర్చుని వున్నారు అయ్యగారు.

మొదటి నెంబరు బైటికి తీసారు కలక్టరు గారు. ఆ నెంబరు పైకి చదివారు. జాక్‌పాట్ నెంబర్‌లా అంతా తమ చేతిలోవున్నా నెంబర్లు వెతుక్కు-న్నారు.

ఆ ఆఫీసు యాజమాన్యంవారు వెంటనే రిజిష్టరు తీసి ఆ నెంబరు ఎదురుగా వున్న పేరు ఎ.ఎస్. చెలం అని చదివారు.

ముందు సీట్లలో వున్న అయ్యగారు ఎగిరి

గంతేసి స్టేజిమీదకు వెళ్ళారు.

అయ్యగారి పేరు వెలం కాదే అన్న అనుమానం కలిగింది సింహాచెలానికి.

అయ్యగారు కలక్టరుగారి దగ్గరకెళ్ళి, ఆ నెంబరు తన అసిస్టెంటుదని, అతన్ని పనిమీద తనే వూరికి పంపానని, కేరాఫ్ ఎడ్రస్సు తనదేనంటూ అవసరమైన కాయితాలు తన బ్రీఫ్‌కేసులోంచి చూపారు.

కలక్టరుగారు అయ్యగారికి చిరునవ్వుతో షేక్‌హ్యాండ్ యిచ్చారు. ప్రముఖ దినపత్రిక ఫోటోగ్రాఫరు ఫోటో తీసాడు. ముఖ్యమైన విషయాలు నోట్ చేసుకున్నాడు ఆ దినపత్రిక విలేఖరి.

ఆ తరవాత వరసగా నెంబర్లు తీసారు. కొంతసేపటికి అయ్యగారు లేచి బైటికి వచ్చేస్తూ, రేపొచ్చి స్కూటరు తీసికెళతానని చెప్పారు.

జనంలోంచి బైటికి వచ్చిన అయ్యగార్ని కలుసుకున్నాడు సింహాచెలం.

"ఒరేయ్ నీ పేరుమీదే మొదటి స్కూటరు వచ్చింది నిన్నే పంపిద్దామనుకున్నాను స్టేజిమీదకు; కాని కలక్టరుగారు స్వయంగా ఆ కాయితాలు అందిస్తుంటే వారి గౌరవానికి భంగం కలుగుతుందని..." ఇబ్బందిగా అన్నారు అయ్యగారు.

"ఎవురైతేనేటిబాబూ . సొమ్ముమీది . మన అప్లికేసనుకే వొచ్చింది బహుమతి అంతేచాలు" ఆనందంగా అన్నాడు సింహాచెలం.

ఆ మర్నాడు మిగిలిన నాలుగు అప్లికేషన్ల నంబర్లు అడిగి తెలుసుకున్నారు అయ్యగారు. అవి వేలసంఖ్యదాటిపోయాయి.

అయ్యగారు కొత్తబండి తెస్తారని ఎదురు చూస్తూ నిలబడ్డాడు సింహాచలం బంగళాగేటు దగ్గర. అయ్యగారు తన పాతస్కూటరు మీదే వచ్చారు. బహుశా బండి వెనకాతల బండిలో వస్తోందేమో, కొత్తది కదా అని తనలో తానే సమాధాన పడ్డాడు సింహాచెలం.

"స్కూటరేది . ?" గుమ్మంలోనే అడిగారు అమ్మగారు.

"అమ్మేసాను." అయ్యగారు లోపలికి నడుస్తూ అన్నారు.

మెట్లకింద నిలబడిపోయిన సింహాచెలానికి సరిగా అర్ధంకాలేదు.

"ఎంతకి ?" అమ్మగారు అడిగారు.

"పదివేలకి ." ఈజీచైర్లోకూర్చుంటూ ఈజీగాచెప్పారు అయ్యగారు.

"అబ్బా !" ఆశ్చర్యం ప్రకటించారు అమ్మగారు.

"మామూలుగా అయితే బ్లాకు నాలుగువేలు. బండి ఫ్రీగా వచ్చిందికాబట్టి సాలిడ్‌గా పదివేలు లాభం " గుండెల్నిండా గాలిపీల్చుకున్నారు అయ్యగారు.

ఆ ఆనందంలో అమ్మగారుకూడ పాలు పంచుకున్నారు.

మెట్లకింద నిలుచుండిపోయిన సింహాచెలం మాత్రం మనసులోనే అనుకున్నాడు "సొమ్మూ అయ్యగారిదే..సోకూ అయ్యగారిదే..."నని. □

వచ్చే సంచిక నుంచి

"కొత్త పుస్తకంతో కొంతసేపు"

విపుల సమీక్షల శీర్షిక చదవండి